www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 మే 2025
5
వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పిం చవచ్చునని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా

లాంగ్‌మార్చ్

- పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, ప్రజాసంఘ నాయకులు
- ముస్లిములకు వైసిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- కడప ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి

లాంగ్‌మార్చ్‌లో ముస్లిములనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసేంతవరకు వైసిపి తరపున పోరాటాలు సాగిస్తామని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి హెచ్చరించారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వారి ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా లాంగ్ మార్చ్ (భారీ ర్యాలీ) ఆదివారం కడపలో నిర్వహి ంచింది. గౌస్ నగర్ నుంచి మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా శివలింగం బీడీ ఫ్యాక్టరీ (టిప్పు సుల్తాన్) ఆల్మాస్‌పేట సర్కిల్, చిలకల బావి మట్టి పెద్దపులి రెండవ గాంధీ బొమ్మ, ఒకటవ గాంధీ బొమ్మ, పొట్టి శ్రీరాములు సర్కిల్ సెవెన్ రోడ్స్ సర్కిల్ వరకు లాంగ్ మార్చ్ సాగింది. అక్కడ నిర్వహించిన సభను ఉద్దేశించి కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా మాట్లాడుతూ వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. లోక్‌సభలో, రాజ్యసభలో వక్ఫ్ బిల్లును వ్యతిరేచించామని చెప్పారు. చట్టంలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లిం ప్రజలకు ఎల్లప్పుడూ వైసిపి అండగా ఉంటుం దన్నారు. రాజ్యాంగ వ్యతిరేక మైన వక్ఫ్ సవరణ చట్టాన్ని మనస్ఫూర్తిగా ముందుకు వచ్చి తాము పోరాటం చేస్తున్నామన్నారు. తప్పకుండా కేంద్ర ప్రభుత్వం మరి ఇన్ని కోట్ల మంది మనో భావాలు గుర్తించాలన్నారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సవరణ బిల్లులో అత్యంత అన్యాయమైన అంశాలు ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డుకు పూర్తిగా హక్కులు తొలగిస్తూ కలెక్టర్ కు హక్కులు ఇచ్చారన్నారు. ఇది ఎంతవరకు న్యాయం అని ప్రశ్నిస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డు యొక్క కౌన్సిల్ కమిటీ యొక్క సంఖ్యను తగ్గించి, తగ్గించిన కమిటీ సంఖ్యలో కూడా ఇద్దరు ముస్లిమేతరులను దాంట్లో పెట్టాలని ఈ బిల్లులో నిబంధన తీసుకు వచ్చారన్నారు. ఎంతవరకు ఇటు వంటి అంశాలు న్యాయం అని చెప్పి మేము కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. తక్షణం ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని రద్దు చేసేంతవరకు పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. ఈ చట్టం రద్దుకు ఎవరు ఎలాంటి కార్యక్రమాలు చేసినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్ర మంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి, వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు నాయ కులు, ముస్లిం జెఎసి నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్ర శేఖర్, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులు, ముస్లి ములు మహి ళలు, పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వక్ఫ్ నూతన సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కడప అర్బన్ : వక్ఫ్ నూతన సంవత్సర చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో వక్ఫ్ నూతన సవరణ చట్టానికి వ్యతిరేకంగా గ్రాండ్ లాంగ్ మార్చ్ కుల,మత, రాజకీయ పార్టీ లకు అతీతంగా నాయకులు, కార్య కర్తలతో పాటు సామాన్య జనం స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు సహకరించిన బిజెపి, టిడిపి, జనసేన పార్టీలను వచ్చే ఎన్నికల్లో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ మళ్లీ సినిమాలు తీసుకోవాలని, చంద్రబాబు విశ్రాంతి తీసుకోవాలని పేర్కొన్నారు. బిజెపి అద్వానిని ఇంట్లో కూర్చో పెట్టినట్లు మోడీని కూర్చోబెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమీర్‌బాబుకు నిరసన సెగ.. వక్ఫ్ అమెండ్మెంట్ చట్టానికి వ్యతిరేకంగా కడపలో జెఎసి ఆధ్వర్యంలో భారీ లాంగ్ మార్చ్ నిర్వహించారు. లాంగ్ మార్చ్‌లో పాల్గొనేందుకు వచ్చిన టిడిపి నాయకుడు అమీర్ బాబును జెఎసి నాయకులు అడ్డుకున్నారు. టిడిపికి రాజీనామా చేసి ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ముసిం ప్రజల గొంతు టిడిపి కోసిందని మండిపడ్డారు. టిడిపి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చేసేదేమీ లేక అమీర్ బాబు వెనక్కు తిరిగి వెళ్లిపోయారు.

కార్మికుల శ్రేయస్సే పరమావధి

- ఇ-శ్రమ్ కార్డుల సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇస్తాం
- జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కార్మికుల శ్రేయస్సే పరమావధిగా ముందుకెళు తున్నాం. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు డేటా బేస్ రూపకల్పనపై దృష్టి సారించాం. ఇ-శ్రమ్ కార్డులు, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు, చైల్డ్ ప్రొటెక్షన్ స్కీముల సహకారంతో సంక్షేమాన్ని అందించడానికి కృషి చేస్తున్నాం. ఎజిఎల్, డిసిఎల్ కేసుల పరిష్కారానికి సహకరిస్తూ ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడానికి తమ వంతు కృషి చేస్తున్నాం. విధుల నుంచి తొలగింపునకు గురైన కార్మికుల పక్షాన నిలుస్తూ వారిని న్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొంటున్న జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్ నాయక్‌తో ప్రజాశక్తి ముఖాముఖి..

ముఖా ముఖి..

అసంఘటిత కార్మికుల వివరాలు తెలపండి?

జిల్లాలో 7.50 లక్షల మంది కార్మికులు ఉండొచ్చు. ఇందులో 3.70 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారు. ఇఎస్ఐ, ఇపిఎఫ్ లేనివాళ్లు, ఆదాయ పన్ను పరిధిలోనికి రాని వారిని, విద్యార్థులు మొదలగువాళ్లు అసంఘటిత కార్మికులుగా పరిగణిస్తాం.

గిగ్ వర్కర్స్ కేటగిరిలోని కార్మికుల సంఖ్య ఎంత?

ఏప్రిల్ మూడు నుంచి 17 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 270 మందిని గిగ్ వర్కర్స్‌గా నమోదు చేయడమైంది. మెప్మా పీడీ, డిఆర్‌డిఎ పీడీలతో కలిసి గిగ్ వర్కర్స్ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

ఇ-శ్రమ్‌కార్డుల మంజూరు గురించి తెలపండి?

ఇ-శ్రమ్‌కార్డుల కోసం సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇ-శ్రమ్ జి.వి. ఇన్ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. అనంతరం ఆధార్ లింక్డ్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

భవన నిర్మాణ కార్మికుల కార్డుల మంజూరుపై మాట్లాడండి?

జిల్లాలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్యకలాపాల పరిధిలోని కార్మికులు రూ.50 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న కార్మికులు రూ.60 చెల్లించి లేబర్ కార్డులను మంజూరు చేయడం జరుగుతోంది.

చైల్డ్ లేబర్ తనిఖీల పక్రియ గురించి తెలపండి?

చైల్డ్ లేబర్ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను దుకాణాలు, హోటళ్ల, ఇతర కార్ఖానాల్లోపని చేస్తున్న దాఖలాల్లేవు. 14 ఏళ్ల వయసుపై బడిన పిల్లలను సైతం గుర్తించి, అటువంటి వారికి చదువుల పట్ల ప్రేరణ కలిగించే ప్రయత్నం చేస్తున్నాం.

ప్రయివేటు సంస్థల వేధింపులతో తొలగింపునకు గురైన కార్మి కుల పరిస్థితేమిటి?

ప్రతి నెలా 15 నుంచి 20 మంది ఉద్యోగాల నుంచి తొలగింపునకు గురైన కార్మికులు వస్తుంటారు. అటువంటి కార్మికులకు కార్మిక శాఖ జాయింట్ మీటింగ్ నిర్వహణ ద్వారా న్యాయం చేయ డానికి ప్రయత్నం చేస్తుంది. బాధిత కార్మికుల, ఉద్యోగుల ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సంస్థలతో సామరస్య పూర్వక పరిష్కారానికి కృషి చేస్తాం. సామరస్య పూర్వ కంగా సమస్యల పరిష్కారానికి సహ కరించని కాంట్రాక్టు, ప్రయివేటు సంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

లేబర్ సెస్ చెల్లింపు విధానంపై స్పందించండి?

నిర్మాణ సంస్థలు ప్లాన్ అప్రూవల్ అథారిటీ సమయంలోనే 10 శాతం లేబర్ సెస్ చెల్లించాలి. దీంతోపాటు లేబర్ ఆఫీస్ నుంచి పలు రకాల లైసెన్స్ తీసుకోవాలి. షాప్‌యాక్ట్, సెంట్రల్ లేబర్ యాక్ట్, ఇంటెగ్రేటెడ్ వర్కర్స్ యాక్ట్‌లతోపాటు సెల్ఫ్ సర్టిఫికెట్ వివరాలను తెలిపి మీసేవ కేంద్రాలు, లేదా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య

మాట్లాడుతున్న జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం, అందరికీ పాత పెన్షన్ పథకం అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బ్రాంచ్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు, ఎఐఐఇఎ లాంటి స్వతంత్ర కార్మిక సంఘాలు, బ్యాంకింగ్ యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు కొట్లాదిమందితో సమ్మె ఉంటుందని తెలిపారు. వందశాతం ఎఫ్‌డిఐ పేరుతో దేశంలోకి విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించబోతున్నారని పేర్కొన్నారు. ఇదే జరిగితే, జాతీయకరణకు ముందునాటి అక్రమాలు మళ్లీ పునరావృతం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల ఆందోళనలకు తలఒగ్గి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఇదే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్లు విపరీతంగా పెరిగిపోయి పని భారం పెరుగుతోందని, తక్షణమే నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, బ్యాంకింగ్ యూనియన్ల నాయకులు లలిత, అజీజ్, జగదీశ్వర్ రెడ్డి, మెడికల్ రెప్స్ యూనియన్ కార్యదర్శి రామానుజుల రెడ్డి, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కంభం చెన్నయ్య, ఈపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఎల్ఐసి క్లాస్ 1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రపాల్, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుధీకర్ సమ్మెకు సంఘీభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, కె సి ఎస్ రాజు, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాటల ద్వారా పిల్లలకు అవగాహన కల్పిస్తున్న సమీర్‌బాషా

చదువుతోనే మంచి భవిష్యత్తు : జెవివి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు చక్కగా చదువుకుంటేనే వాళ్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని, కష్టాలనైనా, కన్నీళ్లనైనా కడతేర్చేది చదువు ఒక్కటేనని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష తెలిపారు. కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు లో భాగంగా ఆదివారం గ్రంథాలయ సెక్రెటరీ అమీరుద్దీన్ పర్యవేక్షణలో నిర్వహించారు. విద్యార్థులకు పాటలు, యోగా, డ్యాన్స్ విషయాల మీద అవగాహన కల్పించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష చదువు ప్రాధాన్యతను వివరిస్తూ చదువుకోవడం వల్ల జ్ఞానం కలుగుతుందని, జ్ఞానం వల్ల లక్ష్య సాధన దిశగా ముందుకు వెళ్లి గమ్యాన్ని చేరుకోవచ్చు అని పాట రూపంలో పాడి వినిపించారు. బడి అంటే జైలు అనే భయాన్ని వదిలి బడి అంటే అమ్మ ఒడిగా భావించి ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని, అంబేద్కర్ చక్కగా చదువుకుని గొప్పవారైనారని, భారత రాజ్యాంగాన్ని రాసి బాబా సాహెబ్ అయ్యారని తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ భారతి యోగాభ్యాసం, ఆసనాలు ఎలా వేయాలి అవి వేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాన్స్ టీచర్ వర్షిని విద్యార్థులకు డ్యాన్స్ లోని మెలకువలు నేర్పించారు. కార్యక్రమానికి పట్టణం లోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిశెట్టి పవన్, లైబ్రరియన్స్ సుబ్రహ్మణ్యం, సురేష్, జేమ్స్ సుబ్బమ్మ, రమణ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశయ స్ఫూర్తికి మారుపేరు

అపర భగీరథ మహర్షి

- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

అకుంఠిత దీక్ష, పట్టుదల, లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నం లోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆశయ సాధన, అకుంఠిత దీక్ష, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం అపర భగీరథ మహర్షి అని కొనియాడారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. భగీరథ మహర్షి మహాజ్ఞాని అని, పరోపకారానికి పెట్టింది పేరని, దీక్షా, సహనానికి ప్రతిరూపమని, ఎంతటి కష్టాన్నినైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే గుణం గల వారిని అన్నారు. ఏదైనా పనిని సంకల్పించినప్పుడు అపర భగీరథునితో పోలుస్తారన్నారు. రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ భగీరథ మహర్షి సేవానిరతి గొప్పదని, దేశం గర్వించదగ్గ మహనీయులలో ఆయన ఒకరని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో మరుగున పడిన మహనీయుల ఆశయాలను, భావాలను ఈనాటి యువతరానికి తెలియజేయాలని ఇటువంటి కార్యమాలను చేపట్టడం హర్షణీయమన్నారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపర భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాలని కోరారు. అంతకుముందు భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, అధికారులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జిని సన్మాస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి

హైకోర్టు జడ్జిలను కలిసిన కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు

ప్రజాశక్తి - కడప

వైఎస్ఆర్ కడప జిల్లా కోర్టు ఆవరణలో శని, ఆదివారాల్లో జరుగుతున్న జ్యుడిసియల్ వర్క్ షాప్, జ్యుడిసియల్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జీలు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తిని ఆదివారం ఉదయం కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షులు జీ.వీ.రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు ఏ. ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన లు మర్యాదపూర్వకంగా కలిశారు. హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుపోలియో జడ్జి అయిన నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించారు. హైకోర్టు జడ్జి బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తికి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తున్న నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

- 2,311 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో నిర్వహించిన నీట్ -2025 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లాలోని మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 2371 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 2311 మంది హాజరు. 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కడప నగర పరిధిలోని ఎస్‌కెఆర్‌అండ్ ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, (గర్ల్స్), మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎం సి హెచ్ ఎస్ మెయిన్స్, అన్నమయ్య సర్కిల్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, వైఆర్‌జడ్‌పిహెచ్ స్కూల్‌లో 1788 మంది పరీక్షలు చేశారు. 51 మంది గైర్హాజరయ్యారు. ప్రొద్దుటూరు పరిధిలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, (మెయిన్), వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 523 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తున్న నిర్వహించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

కడప అర్బన్ : నగరంలోని 'నీట్' పరీక్షా కేంద్రాల వద్ద ఆదివారం ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. 'నీట్' పరీక్షా కేంద్రాలైన కోటిరెడ్డి మహిళా కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మునిసిపల్ హై స్కూల్ మెయిన్, జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల లను ఎస్.పి సందర్శించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. 'నీట్' పరీక్ష నియమ నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కల్నల్ సూర్యనారాయణమూర్తి

హెల్మెట్ ,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు అని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జావిద్ అన్నారు. కడప నగరంలోని తెలుగు గంగ కాలనీలో 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి కల్నల్. సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం రహదారి భద్రత నియమాలపై ఎన్‌సిసి కేడెట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కడప ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జావిద్ మాట్లాడుతూ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని అన్నారు. రహదారి సూచికలు, నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. తద్వారా జరగబోయే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులకు, తమ చుట్టూ ఉన్నవారికి రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జె. ఆత్రే, ఎన్.సి.సి అధికారులు కెప్టెన్ డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్, సి.ఎల్. రెడ్డి, కొండారెడ్డి , ఎన్‌సిసి సీనియర్ కేడెట్లు మల్లికార్జున్, ఆనంది పాల్గొన్నారు.

మోడీ మాటలను ప్రజలు నమ్మరు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : ఆంధ్ర రాష్ట్రానికి వచ్చినటువంటి ప్రధాని నరేంద్ర మోడీ చెప్పిన మాటలు ప్రజలు ఎవరూ నమ్మరని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్, షరీఫ్, ఎస్.కె. ఆదిల్ , ఉపాధ్యక్షులు యువరాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 2న రాష్ట్ర రాజధాని అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాలను పునః ప్రారంభించి దేశ ప్రధాని, ముఖ్యమంత్రి చంద్రబాబు మరో మారు శంకుస్థాపనలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు, బూటకపు మాటలు చెప్పారని పేర్కొన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం నిధులు అధికంగా ఇచ్చామని సభలో దేశ ప్రధాని అబద్ధాలు చెప్పారని చెప్పారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్‌కు వచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, రూ.300 కోట్ల నిధులు ఆర్‌జిబి బ్యాంకును విజయవాడకు తరలించుకొని పోయారని వాపోయారు. రాయలసీమ అభివృద్ధిని అంతా రాజధానికి తరలిస్తున్నారని పూర్తిగా మాయమాటలు మాట్లాడాలని వారు ఎద్దేవా చేశారు.

తొలి తెలుగు ముస్లింవాద రచయిత సత్యాగ్ని

- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

తొలి తెలుగు ముస్లిం వాద రచయితగా షేక్. హుస్సేన్ సత్యాగ్ని తెలుగు సాహితీ లోకంలో చిరస్మరణీయమైన స్థానాన్ని ఆక్రమించారని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం కడప జిల్లా రచయితల సంఘం వారు రచయితల సంఘానికి గౌరవాధ్యక్షులుగా ఉన్న సత్యాగ్నిని వారి స్వగృహంలో కలిసి ఆయన యోగక్షేమాలు విచారించి, ఆయన చేసిన సాహిత్య కృషిని కొనియాడుతూ సత్యాగ్ని దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ముస్లిముల జీవిత విధానాన్ని పరిశీలించి సమగ్రమైన అవగాహనతో ఆయన కథలు రాశారని, అలా ముసిముల జీవితాల గురించి మొట్టమొదటిసారిగా కథలు రాసిన ఖ్యాతి సత్యాగ్నికే దక్కుతుందన్నారు. ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ ముస్లిం స్త్రీల సమస్యలను మొదటిసారిగా ప్రపంచానికి చాటి చెప్పిన సంస్కరణవాదన్నారు. కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ప్రసంగిస్తూ ముస్లిం జీవితాల అంతర్గత సమస్యలకు అక్షర రూపాన్ని ఇచ్చిన షేక్ హుస్సేన్ కథా విప్లవకారుడన్నారు. సభ్యులు డాక్టర్ జి.వి సాయి ప్రసాద్ మాట్లాడుతూ ముస్లిం స్త్రీలకు తలాక్ శాపమని దశాబ్దాల కిందటే ఊహించి కవి కాలాని కంటే ముందుంటాడనే మాటను సత్యాగ్ని నిజం చేశారన్నారు. కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ సత్యాగ్ని కథలతో పాటు మజ్ను ష అనే గొప్ప నాటకాన్ని రచించారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి, భూమి రెడ్డి స్వరూపారాణి మాట్లాడుతూ కవిగా, రచయితగా, కథకునిగా,నాటక కర్తగా, తిరుగులేని రాజకీయ నాయకునిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన సత్యాగ్ని మన జిల్లా సాహిత్య లోకానికి పెద్ద దిక్కని కొనియాడారు.

సత్యాగ్ని దంపతులను సన్మానిస్తున్న జిల్లా రచయితల సంఘం నాయకులు

పిల్లలకు విలువలు నేర్పాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నబికోటలోని మద్రస ఎ ఫైజానె మహబూబె సుబ్హానిలో ఆదివారం దిని కోర్సు క్యాంపులో అంజుమన్ తరఖీ ఉర్దూ జిల్లా శాఖ అధ్యక్షులు సత్తార్ ఫైజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే ధార్మిక చింతన మానవ విలువలు నేర్పాలని, ఉచిత సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రచయిత మతగురువు మహబూబ్ ఖాన్ యుసుఫ్ జయి విద్యార్థులకు 30 రోజుల ఉచిత సమ్మర్ కోర్సు అధ్యాత్మిక పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమీర్ జమాఅత్ అబు ముబారక్, హాఫిజె ఖురాన్ మహమ్మద్ ఇమ్రాన్, దాదాపు నలభై మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్తార్ ఫైజీ

మునిబాబును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

డాక్టర్ మునిబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెండా మాను వీధిలోని డాక్టర్ మొమ్మెల మునిబాబును ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. వీడియో ట్రాన్స్‌మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీసెస్ ఇన్ వైర్‌లెస్ నెట్‌వర్క్‌లో మునిబాబు డాక్టరేట్ సాధించిన సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు రాజు, శ్రీరాజా కళా నిలయం డాన్స్ మాస్టర్ రాజా పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మునిబాబు పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం హర్షణీయమన్నారు. ఆయన మరెన్నో పరిశోధన ఆవిష్కరణలలో విజయం సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి లింగాల మండల కో-ఆర్డినేటర్ మస్తాన్ బాషా, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు బండారు రాజు, రవికుమార్, నాగేంద్ర, మాల్యాద్రి, రాజేష్ పాల్గొన్నారు.

పురవీధుల్లో శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

ఘనంగా జ్యోతుల మహోత్సవం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలోని కొత్తూరు శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతుల మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆదివారం తెల్లవారుజామున జ్యోతులను బైపాస్ రోడ్‌లోని స్థానిక ఆలయం నుంచి ఎత్తుకుని పురవీధులలో బ్యాండ్ మేళాలు నడుమ ఊరేగింపు నిర్వహించారు. జ్యోతుల సందర్భంగా చౌడేశ్వరి అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీపెద్దమ్మ అమ్మవారి దేవర సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పెద్దమ్మ, చౌడేశ్వరి అమ్మవారి వద్దకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోలీసుల నిఘాతో అవాంఛనీయ సంఘటనలకు చెక్..

శ్రీపెద్దమ్మ తల్లి అమ్మవారు జాతర, కొత్తూరు శ్రీచౌడేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల నిఘాతో చెక్ పెట్టారు. పులివెందుల రూరల్ సీఐ రమణ పర్యవేక్షణలో పోలీసులు డ్రోన్ కెమెరా, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్, అమ్మవార్ల దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దేవర ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పూసల కొట్టాలు గ్రామంలో కొలువై ఉన్న అంకాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు చల్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం మొత్తం కుటుంబ సభ్యులు, బంధువులతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు.

రేపటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె

ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు స్థానిక రాచన్న వీధిలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పెద్దలు తెలిపారు. నూతనంగా నిర్మించిన శ్రీహనుమంత్ సమేత సీతారామ లక్ష్మణ ఆలయాన్ని నిర్మించారు. 6న ఉదయం యాగశాల ప్రవేశం, కలశస్థాపన, పుణ్యాహవాచనం, 7న గణపతి పూజ, వేదపారాయణం, హోమాలు, అభిషేకాలు, 8న పాతాకల పూజ, విగ్రహ ప్రాణ ప్రతిష్ట, గోదర్శనం, పూరాహూతి, తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, రాచినేని వేణు ఆధ్వర్యంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తులసిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - చక్రాయపేట

తులసిరెడ్డిని సన్మానిస్తున్న గంగిరెడ్డి

మండలంలోని చిలేకాంపల్లె వద్ద వెలసిన మావిళ్లమ్మ దేవతకు పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసి రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. ఆదివారం మావిళ్లమ్మ విగ్రహ ప్రతిష్ట 41 రోజు పూర్తి కావడంతో అంగరంగ వైభవంగా కార్యక్ర మాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తులసిరెడ్డి పాల్గొన్నారు. స్థానిక నాయకులు చిదంబరం రెడ్డి, ఆవుల మాధవరెడ్డి, రామాంజనేయ రెడ్డి తులసిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, రమణ పాల్గొన్నారు.

ఉచిత వడుగులకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో దొండపాడు రోడ్డులోని మస్జిదే హిదాయి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 40 మంది పేద ముస్లిం బాలులకు ఉచితంగా వడుగులు చేశారు. మసీదు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలురకు వారం రోజులకు సరిపడ మందులను, గోధుమ పిండి తదితర వస్తువులను ఉచితంగా కమిటీ వారు పంపిణీ చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన వైద్యులు ఆజాద్ వడుగులు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆజాద్‌ను ఘనంగా సత్కరించారు. కమిటీ రాయలసీమ ఇన్‌ఛార్జి అయూబ్ ఖాన్, జిల్లా ఇన్‌చార్జి ముక్తియార్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు కమాల్ బాషా, షరీఫ్, చాంద్ బాషా, ఇమాములు, రియాజ్, అమీర్, జుబేర్ పాల్గొన్నారు.

డాక్టర్ ఆజాద్‌ను సత్కరిస్తున్న మసీదు కమిటీ సభ్యులు

'ఉపాధి' కూలీలకు అండ.. బీమా..!

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు అండగా బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. క్షేత్ర స్థాయిలో బీమాపై సరైన అవగాహన లేకపోవడంతో కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా అందుకోలేకపోతున్నారు. మండల వ్యాప్తంగా 11,057 జాబు కార్డులు ఉన్నాయి. ఇందులో 7,477 యాక్టివ్ జాబ్ కార్డులున్నాయి. వీటిలో 4,600 మంది కూలీలు పనులకు వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీల భద్రత కోసం రెండు రకాల బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 18-70 సంవత్సరాలలోపు వారు అర్హులు. వీరు ఏటా రూ.20 చెల్లిస్తే ఈ పథకంలో ప్రయోజనం పొందవచ్చు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు కుటుంబానికి అందుతుంది. జాబ్ కార్డులో ఎంతమంది ఉంటే అంతమందికి ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది. ఇంకొకటి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన. ఇందులో సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే 18 నుంచి 50 సంవత్సరాల వయసు వారు అర్హులు. ఇందులో కేవలం ఇంటి పెద్ద మాత్రమే బీమా పొందే అవకాశం ఉంటుంది. సహజ మరణమైన, ప్రమాదవశాత్తు మరణించినా బీమా మొత్తం రూ.2 లక్షలు మరణించిన వ్యక్తి నామినీకి అందజేస్తారు.

వంద శాతం అమలుకు చర్యలు..

గతంలో ఇలాంటి బీమా పథకాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ ఏడాది వంద శాతం నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కూలీలు దరఖాస్తును ఆయా గ్రామాల పరిధిలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందజేయాలి. వారు వాటిని బ్యాంకులో సమర్పించి ఆన్‌లైన్ చేస్తారు. మే నెలలో బీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

- కృష్ణమూర్తి, ఎంపిడిఒ, సింహాద్రిపురం

అవగాహన లేక నష్టపోయిన కూలీ కుటుంబం..

మండలంలోని గురజాలలో ఇటీవల ఉపాధి హామీ పనులకు వెళ్లిన బోరెడ్డి ఓబుల్‌రెడ్డి వడదెబ్బతో పనిచేస్తున్న ప్రదేశంలోనే మృతి చెందాడు. బీమాపై సరైన అవగాహన లేకపోవడంతో బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించలేదు. ఈ కారణంగా బీమా ఆ కుటుంబానికి వర్తించలేదు.

బీమాపై పూర్తిగా అవగాహన కల్పించాలి..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు సరైన అవగాహన లేక బీమా సౌకర్యాన్ని పొందలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించి బీమా చేసేలా చర్యలు తీసుకోవాలి.

- శివశంకర్ రెడ్డి, ఉపాధి కూలీ, సింహాద్రిపురం

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

మండలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీమాపై కూలీలకు వివరించాం. బీమా చేయడం వల్ల వారి కుటుంబానికి ఎంతో భరోసా ఉంటుంది. ప్రతికూలీ బీమా చేసుకోవాలి. **- జయభారతి, ఎపిఒ, సింహాదిపురం**

పేదలకు వరం సిఎం సహాయనిధి

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండ అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో తన నివాసంలో ఎమ్మెల్సీ లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి రూ.3,49,357(చెక్కులను) అందజేశారు. వేముల మండలం చింతల జూటూరు గ్రామానికి చెందిన ఎద్దుల గంగాదేవికి, నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన వడ్డెరపు గంగాదేవికి, సింహాద్రిపురం మండలం,గురజాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి అమృతవాణికి, వేంపల్లి మండలం కత్తులూరు గ్రామానికి చెందిన కలమల అంజనమ్మకు, తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన గుజ్జల నాగ మునిరెడ్డికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థికసాయం అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు 'పొన్నతోట'

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఆదర్శ కమ్యూనిటీ యోధుడు పొన్నతోట వెంకటరెడ్డి అని మాజీ మాజీ జడ్‌పిటిసి సభ్యులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంకాలమ్మ గూడూరులో పొన్నతోట వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలను పొన్నతోట స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎందరో అతిరథ మహారథులను జాతికందించిన సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలో జన్మించిన నిస్వార్థ ప్రజా సేవకుడు వెంకట్ రెడ్డి అన్నారు. తెల్ల దొరల కాలంలోనే ఉపాధ్యాయ, చేనేత కార్మిక, రైతు, రైతు కూలీ, మహిళ, బండ్ల కార్మిక తదితర సంఘాలను నిర్మించారన్నారు. అప్పటి రైతు సమస్యల పరిష్కారానికి కృష్ణ, తుంగభద్ర జలాల కోసం మొదట కరపత్రం వేయడమేకాక ప్రజా ఆందోళన నిర్వహించిన గొప్ప వ్యక్తి అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బాలబయన్న ఆధ్వర్యంలో మ్యాజిక్ షో నిర్వహించారు. జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత పొన్నతోట గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో అంకాలమ్మ గుడి దేవస్థానం చైర్మన్ సోమ కొండారెడ్డి, నక్కలపల్లి కొండారెడ్డి, రమణ, పోస్టు శివుడు, కందుకూరు సోమిరెడ్డి, కెవి రవి, అశోక్, రామ్మోహన్, ప్రసాద్, అజయ్, సరళ, రఘు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

మాట్లాడుతున్న మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

'మఠం' అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ ఆహ్వానం మేరకు ఆయన విచ్చేశారు. శ్రీ జగన్మాత ఈశ్వరి మహాదేవి మఠాధిపతులు వీర శివకుమార్ స్వాములు, మఠం అధిపతి కుమారుడు వెంకటాద్రి స్వామి, అమ్మవారి, స్వామి వారి వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసి సంప్రదాయ ప్రకారం సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మఠం చుట్టూ ప్రాకారపు నిర్మాణానికి రూ.కోటి 25 లక్షలు వెచ్చించామన్నారు. కల్యాణమండపం రూ.98 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. టిటిడి సదనం ముందు సిసి ఫ్లోరింగు రూ.47 లక్షలతో పూర్తి చేశామన్నారు. శ్రీ పోలేరమ్మ గుడి వద్ద టాయిలెట్ బ్లాకు రూ.42 లక్షలతో నిర్మించామన్నారు. శ్రీ పోలేరమ్మ గుడి వద్ద ఫ్లోరింగుకు రూ.29 లక్షలు ఖర్చు చేశామన్నారు. దాతల సహకారంతో పోలేరమ్మ గుడి వద్ద వాటర్ ట్యాంక్, గుడి విశ్రాంతి షెడ్డు, దేవస్థాన కార్యాలయం, పోలేరమ్మ గుడి ప్రాంగణంలో రేకుల షెడ్డు, పోలేరమ్మ గుడికి రథం, పోలేరమ్మ వద్ద క్యూలైన్లు దాతల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. మఠం అభివృద్ధి విషయంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా పిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఇలాంటి మంచి పనులు చేయడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎండోమెంట్ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకునేలా అధికారులు ఉండాలన్నారు. మండల టిడిపి నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు 3000 వేల మజ్జిగ ప్యాకెట్లు, చల్లటి నీళ్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎల్లటూరి సాంబశివరెడ్డి, పూజ శివయ్య యాదవ్, ఎత్తపు ఈశ్వర్ రెడ్డి, మేకల సుధాకర్, మల్లేపల్లి టిడిపి నాయకులు చిలమల నారాయణ, నేలటూరు టిడిపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాటి గురువులతో అప్పటి విద్యార్థులు

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు ఉన్నత పాఠశాల 2003-04 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని కృష్ణారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు తమ ఆత్మీయతను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి రోజులను గుర్తు తెచ్చుకుంటూ ఆనందించారు. పెద్దలంతా పిల్లలుగా మారి సందడి చేయడం గురువులను కూడా సంతోష పెట్టింది. కార్యక్రమంలో 60 మందికిపైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులు, ప్రదీప్ , మధు, లక్ష్మీనారాయణ రెడ్డి, రమణ పాల్గొన్నారు.

పెద్దముడియం : మైలవరం మండల కేంద్రం లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 1998-2003 బ్యాచ్ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. దాదాపు 50 మంది పూర్వ విద్యారినులు తాము చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకుని సంతోషపడ్డారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు వివిధ హోదాల్లో తమ విధులను నిర్వ హించడం గురుకుల పాఠశాలకు తలమానికమని గురువులు పేర్కొన్నారు.

మైలవరం గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

ఎమ్మెల్యేతో గౌడ సంఘం నాయకుల భేటీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మహానాడు విషయమై ఎమ్మెల్యేతో గౌడ సంఘం నాయకులు ఆదివారం భేటీ అయ్యారు. పట్టణంలో ఏర్పాటు చేయాల్సిన వసతుల విషయమై చర్చించారు. వివరాల్లోకెళితే... స్థానిక నెహ్రూ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంగి గురుమూర్తి, టిడిపి తొగట వీర క్షత్రీయ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ జిల్లాలో జరగబోయే టిడిపి రాష్ట్ర మహానాడుకు సంబంధించి ప్రజలకు కావలసిన సౌకర్యాలు, ప్రొద్దుటూరు పట్టణంలో ప్రజాప్రతినిధులు రాత్రి వేళ బస చేయడానికి కావలసిన వసతులు తదితర అంశాలపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న ఎర్రబోయిన రమాదేవి, కుటుంబ సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - కడప

భవన నిర్మాణం కార్మికుల సంఘం మాజీ అధ్యక్షులు ఎర్రబోయిన కన్నా 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కడప నగరం ఎర్రముక్కపల్లి శివాలయం వీధిలో ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎర్రబోయిన కన్నా చిత్రపటానికి ఆయన కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సతీమణి ఎర్రబోయిన రమాదేవి, కుమారుడు ఎర్రబోయిన సాయి గణేష్, కుమార్తెలు సాయి శిల్ప, సాయి బిందు, సాయిని, అల్లుళ్ళు బాలసుబ్రమణ్యం, జగన్ మోహన్, నవీన్ కుమార్, అన్నదమ్ములు ఎర్రబోయిన సాయిబాబా, ఎర్రబోయిన సుబ్బ రాయుడు, ఎర్రబోయిన శ్రీనివాసులు, చెల్లెల్లు రత్నమ్మ, భారతి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

మహర్షి భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

లక్ష్య సాధనలో మహర్షి భగీరథుడు స్ఫూర్తి

ప్రజాశక్తి - చాపాడు

లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడే స్ఫూర్తి అని సగర సంఘం జిల్లా అధ్యక్షులు మాదాసు మురళి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పల్లవోలు అంకాలమ్మ దేవాలయ ఆవరణలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని తెలిపారు. నేటి తరానికి ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సగర సంఘం మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు మొగిలి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రామచంద్ర, సుబ్బరామయ్య, రఘురాముడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాయితీతో జిప్సం మంజూరు

ప్రజాశక్తి - చక్రాయపేట

ఖరీఫ్ సాగు కోసం ముందుచూపుతో రైతులకు రాయితీతో జిప్సం అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నవ్వంత బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్ర సహాయకులను సంప్రదించాలన్నారు. రాయితీ వేరుశెనగ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ అధికారి రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లింగాల 33 కెవి లైన్ మరమ్మతులు కారణంగా లింగాల, రామన్నూతలపల్లె, గుణకణపల్లె సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని సిఐ నర్సింహులు అన్నారు. ఆదివారం సాయంత్రం సిఐ నర్సింహులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దుకాణాల ముందు వాహనాలను పార్కింగ్ చేయాలని కోరారు. దుకాణాల యాజమానులకు పలు సూచనలు ఇచ్చారు. పబ్లిక్ స్థలాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవరగుట్టపల్లెలో వాటర్ స్కీమ్ ప్రారంభం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని దేవరగుట్టపల్లెలో టిడిపి మండలశాఖ ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి వాటర్ స్కీమ్ బోరును ప్రారంభించారు. ఆదివారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చక్రాయపేట గ్రామ పంచాయతీలోని యార్లవాండ్లపల్లిలో టిడిపి నాయకుడు మేకల చిన్న గంగయ్య కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నేర్సుపల్లి గ్రామం దేవరగుట్టపల్లెలో మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య ఆహ్వానం మేరకు స్కీం బోరును ప్రారంభించారు. నారపురెడ్డిగారిపల్లె టిడిపి నాయకులు శివారెడ్డి విందులో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కీం బోరును ప్రారంభిస్తున్న మహేశ్వర్ రెడ్డి